క్లుప్తంగా

ఆలయానికి ఏసీ పరికరం విరాళం



ఏసీ అందజేసిన దృశ్యం

శిరివెళ్ల: శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయానికి ఓ దాత శనివారం ఏసీ పరికరం విరాళంగా అందజేశారు. హైదరాబాదుకు చెందిన ఎస్ఈసీ ఇండస్ట్రీస్ విద్యాసాగర్, మహదేవపురం గ్రామానికి చెందిన దాత డాక్టర్ విజయ్ ఏసీ పరికరాన్ని ఆలయ చైర్మన్ రామాంజనేయ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త నుసినాగిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నిబంధనలతో తీవ్రంగా నష్టపోతున్న 2015 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాయలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం అనే నిబంధన వల్ల 8ఏళ్లు నాన్ స్టాంబింగ్ పూర్తి కాకుండానే ఏడున్నరేళ్లకే బదిలీ కావాల్సి వస్తుందని తెలిపారు. 8ఏళ్లు పూర్తి కానందున ప్రస్తుతం బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, స్టేషన్ పాయింట్ ఆరు నెలల కాలానికి మొత్తం పాయింట్ కలిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పదో తరగతి మాల్ ప్రాక్టీస్‌లో కేసులు నమోదైన ఉపాధ్యాయులకు బదిలీలో అవకాశం ఇవ్వాలన్నారు. విజయరావు, భాస్కరరెడ్డి, సుమయూన్, జగదీష్, చెన్నుడు, నరసింహులు, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

చాగలమర్రి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎంఈఓ అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు పీటర్ (551), పి.అబ్దుల్ రెహమాన్ (514), ఎం.అఫ్జల్ (513), బి.వైష్ణవి (512), ఈఎం .గణపతి రెడ్డి (502), ఈ.చరిత (485)మార్కులు సాధించారు. వీరికి ఏటా కాసా.మహేశ్వరరెడ్డి అందజేసే నగదుతో పాటు పురస్కారం, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లా షబ్బీర్ సహకారంతో పీటర్‌కు రూ.10 వేలు, పి.అబ్దుల్ రెహమాన్‌కు రూ.6 వేలు, ఎం. అఫ్జల్‌కు రూ.4 వేలు, వైష్ణవి, గణపతి రెడ్డికి రూ.2వేల చొప్పున అందజేసి ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ ముల్లా. రఫీ, ఉప సర్పంచ్ షేక్ సోహెల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు



పట్టాలు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ సునీత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నూనెపల్లెలోని 21వ వార్డులో 75 మంది లబ్ధిదారులకు మాజీ కౌన్సిలర్ అనిల్‌అమృతరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారావు, రాష్ట్ర దృశ్య, కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ శనివారం పట్టాల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేదలందరికీ ప్రభుత్వం పట్టాలు అందజేస్తుందని చెప్పారు. నాయకులు శేషు, సుబ్బరాయు డు, నాగేశ్వరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలో 79 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేసినట్లు వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించామని చెప్పారు. భూ యజమానుల నుంచి సాగు ఒప్పంద పత్రాలు అందజేసిన వారికి కౌలు కార్డులను ఇస్తున్నామన్నారు. వీటి హక్కు 11 నెలలు మాత్రమే ఉంటుందని, ప్రభుత్వం నుంచి పలు సంక్షేమ పథకాలు విత్తనాలు, ఎరువులు పొందేందుకు దోహద పడుతుందని వివరించారు.

సమయం పొడిగించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని కౌలు రైతులందరికీ సీసీ కార్డులు ఇచ్చేందుకు జూన్ నెల 25 వరకు సమయం పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. ఈ మేరకు శనివారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భూ యజమానితో సంబంధం లేకుండా అగ్రిమెంట్‌తో పాటు షరతులు లేకుండా వాస్తవ సాగుదారులకే కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మార్క్, ఏలియా పాల్గొన్నారు.

గంగ..తీరనున్న బెంగ

తెలుగుగంగ.. నిర్మించినప్పటి నుంచి నిన్నటి వరకు ఆలనా పాలన పట్టించుకోలేదు. దీంతో నీరు సక్రమంగా పారక రైతులు పంటలు కోల్పోవాల్సి వచ్చింది. పరిస్థితిని గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాల్వలకు మరమ్మతులు, కల్వర్టుల నిర్మాణం, లైనింగ్ తదితర పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం పనులు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయితే దిగువకు నీరు సమృద్ధిగా అందనుంది.

- తెలుగుగంగ ప్రధాన కాల్వలో కూలిన రక్షణ గోడకు మరమ్మతులు
- 21వ బ్లాక్ కాల్వలో పూడిక తీత, కట్టల బలోపేతం
- నూతన కల్వర్టుల నిర్మాణం
- రుద్రవరం నుంచి చిన్నవంగలి వరకు మరమ్మతులు
- రూ.15 కోట్లతో వేగంగా సాగుతున్న పనులు



రుద్రవరం సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టకు రక్షణ గోడ నిర్మిస్తున్న దృశ్యం

రుద్రవరం: తెలుగుగంగ కాల్వ.. మండలానికి ప్రధాన సాగు నీటి వనరు. మండలంలో తెలుగుగంగ పరిధిలో 16వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. అలాగే..తెలుగుగంగ కాల్వల ద్వారా మండలంలోని 12 చెరువులకు నీరందుతుండగా వీటి పరిధిలో 6వేల హెక్టార్లలో పంటలు సాగవుతాయి.టీజీ కాల్వల ద్వారా 6 కుంటలకు నీరందుతాయి. వీటి కింద దాదాపు 3వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉంటుండటంతో బోర్లలో నీటి ధార తగ్గడం లేదు. మండలంలో బోర్ల కింద దాదాపు 16వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే ప్రధాన కాల్వ లైనింగ్ పలుచోట్ల దెబ్బతినడం, బ్లాక్ కాల్వలు దెబ్బతినడం, కల్వర్టులు శిథిలమమడంతో నీరు సక్రమంగా పారడం లేదు.

కాల్వలు ఇలా..

మూడు దశాబ్దాల క్రితం తెలుగుగంగ కాల్వలు తవ్వారు. ప్రధాన,ఉప ప్రధాన కాల్వల పనులు పూర్తి చేయించి అప్పటి పాలకులు సాగు నీటిని విడుదల చేశారు. నాటి నుంచి నిన్నటి వరకు వాటి మరమ్మతులను తదుపరి పాలకులు పట్టించుకోలేదు. ఫలితంగా కాల్వలు దెబ్బతిన్నాయి. రుద్రవరం మండల పరిధిలో 16వ బ్లాక్ నుంచి 25వ బ్లాక్ వరకు ప్రధాన, ఉప ప్రధాన కాల్వలు దెబ్బతిన్నాయి. రుద్రవారం ఎగువన ప్రధాన కాల్వ రక్షణ గోడ కూలడం, కట్ట దిగువ నుంచి నీరు లీకేజీ ఏర్పడి ప్రమాదకరంగా మారింది. 10 ఉప ప్రధాన కాల్వలకు గండ్లు పడటం, కల్వర్టులు శిథిలమవడంతో వరి ఆయకట్టుకు నీరు చేరక రైతులు ఆందోళన చెందేవారు.

మారుతున్న కాల్వల రూపురేఖలు..

తెలుగుగంగ కాల్వల పరిస్థితిని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు.అలాగే టీజీపీ అధికారులు కాల్వల మరమ్మతు పనులకు నివేదికలు రూపొందించి ఉన్నతాధికారుల ద్వారా సీఎంకు నివేదించారు. నిధులు విడుదలవడంతో అధికారులు టెండరు ప్రక్రియ నిర్వహించి, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించగా ప్రస్తుతం మరమ్మతులు వేగంగా సాగుతున్నాయి.

జోరుగా పనులు..

➡ మండలంలోని 10 ఉప ప్రధాన కాల్వల మరమ్మతు పనులతో పాటు ప్రధాన కాల్వ రక్షణ గోడ మరమ్మతులకు దాదాపు రూ.15 కోట్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు.

➡ రుద్రవరం ఎగువ భాగంలో రెండు ప్రదేశాల్లో కూలిన ప్రధాన కాల్వ కట్ట రక్షణ గోడకు మరమ్మతులు చేస్తున్నారు.

➡ గుట్టకొండ నరసింహస్వామి ఆలయం నుంచి టీ.లింగందిన్నె, రుద్రవరం, ఆర్.నాగలవరం గ్రామాల మీదుగా ముత్తలూరు వైపు నుంచి ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె గ్రామం వైపు నీరు పారే 21వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో పనులు సాగుతున్నాయి.

➡ కాల్వలో పూడిక తొలగించి ఇరువైపులా కట్టలను బలోపేతం చేస్తున్నారు.

> **పనులు వేగంగా జరుగుతున్నాయి**
>
> తెలుగుగంగ కాల్వలకు పడిన గండ్లు, మరమ్మతులు, పూడికతీత, కాల్వకట్టల బలోపేతం, కల్వర్టులకు మరమ్మతులు, మెయిన్ ఛానల్‌లో కొండ ఉర్లి పడిన వాటి మరమ్మతులకు మొత్తం రూ.15 కోట్లతో పనులు చేయిస్తున్నాం. రుద్రవరం నుంచి చాగలమర్రి మండలంలోని చిన్నవంగళి వరకు పనులు చేయిస్తున్నాం. కాల్వకు నీరొచ్చే లోపు పనులు పూర్తి చేయిస్తాం. నీరు సాఫీగా ప్రవహించేలా చేయిస్తున్నాం.
>
> – శంకర్ రెడ్డి, తెలుగుంగ ఈఈ

➡ గుట్టకొండ నరసింహస్వామి ఆలయం వద్ద దెబ్బతిన్న కల్వర్టును పూర్తిగా తొలగించి నూతన కల్వర్టు నిర్మిస్తున్నారు.

➡ తుండ్లవాగు రిజర్వాయరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు కాల్వల ద్వారా, కడప వైపు సాగు నీరు సక్రమంగా పారేలా పనులు చేపట్టడానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు సమాయాత్తమవుతున్నారు.



21వ బ్లాక్ కాల్వలో పూడిక తీస్తున్న జేసీబీ



గుట్టకొండ నరసింహస్వామి ఆలయం వద్ద నూతన కల్వర్టు నిర్మిస్తున్న దృశ్యం



దిగువకు సులభంగా నీరు పారేలా 21వ బ్లాక్ కాల్వ తీర్చిదిద్దిన దృశ్యం

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

ఉయ్యాలవాడ : గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించండి, కావలసిన వసతులను సమకూరుస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శనివారం హౌసింగ్ డే పురస్కరించుకుని స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఉయ్యాలవాడ జగనన్న లేఅవుట్ కాలనీలో 127 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఉయ్యాలవాడలో ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి పట్టాలు మంజూరు చేశామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలనీలో తాగునీరు, విద్యుత్, రహదారులు ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. 20 మంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షాధిక్‌బాషా, వీఆర్‌ఓ రవిప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

ఆటోను ఢీకొట్టిన కారు.. మహిళ దుర్మరణం

దువ్వూరు : మండలంలోని కానగూడూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆటోను కారు ఢీకొనడంతో మహిళ దుర్మరణం చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. చాగలమర్రి మండలం గొడిగెనూరు గ్రామానికి చెందిన 18 మంది వ్యవసాయ కూలీలు ఆటోలో దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామానికి వ్యవసాయ పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని గ్రామానికి ఆటోలో బయలుదేరారు. కానగూడూరు వద్ద తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా అమగల్ గ్రామానికి చెందిన కారు తిరుమల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా అదుపు తప్పి ఆటోను ఢీకొంది. ప్రమాదంలో దూదేకుల సుబ్బమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త హుసేనయ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన జి.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, మాబుచాన్‌ను ప్రొద్దుటూరు, చాగలమర్రి ఆస్పత్రులకు 108 వాహనాల్లో తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన సుబ్బమ్మ

ఆర్ఆర్ఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని పాత వస్తువులను రీసైక్లింగ్ పద్ధతి ద్వారా పునర్వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. శనివారం 15వ వార్డులో ఆర్ఆర్ఆర్ కేంద్రం సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పాత వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా రెడ్యూస్, రీయూజబుల్, రీసైక్లింగ్ కేంద్రానికి అందించాలని సూచించారు. ఈ కేంద్రం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బట్టలు, పుస్తకాలు, ఇనుము, చెక్కతో చేసిన వస్తువులను పడేయకుండా రీ సైక్లింగ్ కేంద్రానికి ఇస్తే ఆ వస్తువులు మరొకరికి ఉపయోగపడేలా చేస్తారన్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.



15వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న చైర్ పర్సన్, అధికారులు

దోమల నివారణతో వ్యాధులు దూరం



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి

రుద్రవరం: దోమల నివారణతో వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. స్థానిక హెచ్‌సీ, అందులోని ల్యాబ్, రికార్డులను శనివారం పరిశీలించారు. రికార్డుల నిర్వాహణ సరిగా లేకపోవడంతో సక్రమంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా,డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. అలాంటి వ్యాధులు సోకకుండా ఉండాలంటే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికోసారి డ్రైడే పాటించాలని చెప్పారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు ప్రసాద్ ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



సుద్దమల్ల శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

నన్ను ఉపయోగించుకోవచ్చుగా!

దొర్నిపాడు: 'విద్యుత్ లేని సమయంలో విధి నిర్వహణలో మీకు ఇబ్బందులు ఎదురుకాకూడదని, కార్యాలయంలో నితరంతర సేవలు కొనసాగేందుకు నన్ను రూ.లక్షలు పోసి కొన్నారు. అయితే ప్రస్తుతం నన్ను పూర్తిగా విస్మరించారు. ఒక్కసారి నా సేవలను గుర్తు తెచ్చుకొని, కాస్త మరమ్మతులు చేయిస్తే.. మీ సేవల తరిస్తాను'. స్థానిక తహసీల్దార్ కార్యలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్ కార్యలయాలనికి తన సేవలను అందించింది. 2019లో నూతన తహసీల్దార్ కార్యలయ భవన నిర్మాణం కోసం టీడీపీ హయాంలో తహసీల్దార్ కార్యలయాన్ని తొలగించారు. ఆ తరువాత ఆ ప్రభుత్వం కార్యాలయ నిర్మాణ ఊసెత్తకపోవడంతో ఆ శాఖ అధికారులకు కార్యాలయం కరువైంది. నిలువ నీడ లేకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతితో ఎంపీడీఓ కార్యలయంలోని రెండు గదులు కేటాయించారు. దీంతో అక్కడ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అయితే జనరేటర్‌ను వినియోగించకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నిరుపయోగంగా మారింది.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా జనరేటర్

కూలీలకు సదుపాయాలు కల్పించండి

నంద్యాల(రూరల్): ఉపాధి హామీ కూలీలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులకు ఎంపీపీ శెట్టి ప్రభాకర్ సూచించారు. శనివారం మండలంలోని రాయమాల్పురం గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ నరసింహ, ఫీల్డ్ అసిస్టెంట్ దేవన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి ప్రభాకర్

వెలుగులు నింపేందుకు చీకట్లో..



రాత్రి పూట వాహనాల లైట్ల వెలుగుల్లో పనులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె, డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామాలకు వెలుగులు నింపేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది చీకటిని సైతం లెక్కచేయకుండా మూడురోజులుగా శ్రమిస్తున్నారు. శనివారం రాత్రికి ఎట్టి పరిస్థితుల్లో త్రీఫేస్ లైన్ ఇచ్చేందుకు ఇదిగో ఇలా కష్టపడుతున్నారు. చిమ్మచీకట్లో పొలాల్లో వాహనాల లైట్ల వెలుగుల్లో పనులు చేస్తున్న సిబ్బందిని ఏడీ ఖాజావలి, ఏఈ రామసుబ్రహ్మణ్యం అభినందించారు. ఇటీవల వీచిన పెనుగాలులకు రెండు గ్రామాల్లో సుమారు 70 స్తంభాలు విరిగిపడిన విషయం తెలిసిందే. త్రీఫేస్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాల్లో నీటి సరఫరాకు భంగం కలుగుతుందని, నిర్విరామంగా కష్టపడుతున్నారు. ఆదివారం నుంచి రెండు గ్రామాల ప్రజలకు విద్యుత్ కష్టాలు తొలగుతాయని అధికారులు తెలిపారు. లైన్‌ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య, లైన్‌మెన్ నాగన్న ఉన్నారు.

విద్యతో పాటు కళలపై దృష్టి సారించాలి

నంద్యాల(వ్యవసాయం): తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు కళలు, లలిత కళలు, క్రీడలపైన దృష్టి సారించి వారి అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో కళారాధన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాసాధన 2023 ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరై మాట్లాడారు. అనంతరం గుర్రాల రామకృష్ణయ్య వార్షిక పురస్కారాలను అందజేశారు. చివరగా విద్యార్థుల శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, సినీ లలిత గానాలు ఆకట్టుకున్నాయి. కోచ్‌లకు, విద్యార్థులకు మెమొంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దస్తగిరిరెడ్డి, కమిషనర్ రవిచంద్రారెడ్డి, కళారాధన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ రామకృష్ణారెడ్డి, రవిప్రకాష్, రంగనాథ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

శిరివెళ్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని చలమరేంజి పెద్దకంబలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం గోవిందపల్లె, వీరారెడ్డిపల్లెలో పర్యావరణ పరిరక్షణ, నీరు, విద్యుత్ ఆదా, ప్లాస్టిక్ వాడక నిషేధంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా అంశాలతో పాటు మొక్కలు నాటి సంరక్షిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

శిబిరాన్ని వినియోగించుకోండి

శిరివెళ్ల: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జరిగింది. ఆయన మాట్లాడు తూ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఆట పాటలు, విజ్ఞానం, నీతి కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, లైబ్రేరియన్ సుజాత పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య(55) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఒంట్లో ఇబ్బందిగా ఉందని మెడికల్ స్టోర్‌కు వస్తుండగా స్థానిక అంకాలమ్మ గుడి సమీపంలో కుప్పకులాడు. వెంటనే ఆటోలో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జయప్రసాద్ సిబ్బందితో కలిసి ఇంటి వద్దకు వెళ్లి భార్య సుబ్బలక్ష్మమ్మ, ముగ్గురు కుమార్తెను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.15వేల నగదు అందజేశారు.

బదిలీలకు 32 మంది దరఖాస్తు

ఉయ్యాలవాడ : బదిలీలపై వెళ్లేందుకు మండలంలో 32 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని ఎంఈఓ అనురాధ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 14 మంది ఉపాధ్యాయులు, ఇష్టపూర్వకంగా ఇతర మండలాలకు వెళ్లేందుకు 11 మంది, ఇతర జిల్లాలకు వెళ్లేందుకు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

మస్తిష్కాన్ని మార్చే శక్తి పుస్తకానిదే



బైక్ యాత్రను స్వాగతిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మస్తిష్కాన్ని మార్చే శక్తి పుస్తకానిదేనని ప్రముఖ రచయిత, సామాజిక వేత్త మంచికంటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మరో గ్రంథాలయం ఉద్యమం పేరుతో బైక్ యాత్ర చేపట్టిన వెంకటేశ్వరరెడ్డి శనివారం నంద్యాల చేరుకున్నారు. ఈ బైక్ యాత్ర ఒంగోలు నుంచి బయల్దేరి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు మీదుగా నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా పద్మావతినగర్‌లోని పింగళి సూరన జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయ అధికారులు, సాహితీ వేత్తలు, ఉపాధ్యాయులు ఆయనను సత్కరించారు.ఆయన మాట్లాడుతూ సాహిత్యం, సామాజిక చైతన్యం కోసం గ్రంథాలయాల ఆవశ్యకతను పెంచాలనే ఉద్దేశంతో బైక్ యాత్రను చేపట్టానని చెప్పారు. నరసింహారెడ్డి, గ్రంథాలయ అధికారులు శ్రీధర్, మధు, ఉపాధ్యాయులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, నరేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. దీక్ష శిబిరానికి పరిశీలకుడిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి బాబా సాహెబ్ మాట్లాడుతూ ఉద్యోయులకు రావాల్సిన బకాయిలను ఇవ్వాలని కోరారు. దీక్షకు ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

అన్నదానం ఎంతో పుణ్యఫలం

మహానంది: అన్నదానం చేస్తే ఎంతో పుణ్యఫలం దక్కుతుందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అబ్బీపురం మాజీ సర్పంచ్ చింతకుంట్ల నాగలక్ష్మమ్మ, బాలరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనాథ్‌రెడ్డి మహానందిలో అన్నదాన ప్రసాద పథకానికి శనివారం ఆరటన్ను బియ్యం విరాళంగా అందించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో దాతలకు స్వామి,అమ్మవార్ల ప్రసాదాలను అందించి సత్కరించారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు , అన్నదానం పథకం ఇన్‌చార్జ్ రామశివ పాల్గొన్నారు.